క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన



బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలోని మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయికి లక్ష కుంకుమార్చనను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొత్తయల్లంటి గ్రామానికి చెందిన కోట దేవేందర్‌రెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కాగా కామాక్షితాయి అమ్మవారిని మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ జనరల్ సెక్రటరీ దుష్యంత్‌కుమార్ గౌతమ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి,ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు ఉన్నారు.

రక్తదాతకు సన్మానం



కోవూరు(విడవలూరు): ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నెల్లూరులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విడవలూరు మండల రెడ్‌క్రాస్ చైర్మన్ శ్రీనివాసులును రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి ఘనంగా సత్కరించారు. శ్రీనివాసులు ఇప్పటి వరకు 55 సార్లు రక్తదానం చేశారు. అలాగే రక్తదానంపై అవగాహన కల్పిస్తూ రక్తదాతలను ప్రోత్సహించడంపై సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ మహోత్సవం



పొదలకూరు : పట్టణంలోని పద్మావతినగర్‌లో అగ్నిగుండ మహోత్సవాన్ని బుధవారం వేకువన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత నెలరోజులుగా పండిరిభజన గురువు ప్రభాకర్‌దాస్ ఆధ్వర్యంలో పండరిభజనలో శిక్షణ పొందిన వారు మంగళవారం రాత్రి గంగస్నానం, కంకణధారణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పండరిభజన వేశారు. బుధవారం వేకువన నరసింహ దండకం తర్వాత నియమనిష్టలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. కేఆర్‌ఆర్ గార్డెన్స్ యజమానులు సోమా భాస్కర్‌రావు, మలిశెట్టి శివశంకర్ వాయిద్యకళాకారులను ఏర్పాటు చేశారు.

అంగన్‌వాడీ సేవలపై అవగాహన ర్యాలీ



ఇందుకూరుపేట: జనభగీరథ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గుడి ముంజుల ఆధ్వర్యంలో గంగపట్నంలో ఐసీడీఎస్ సేవలపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నామని వివరించారు. ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చాముండేశ్వరి, సుమ, తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాలపై అవగాహన



ముత్తుకూరు: ఆదాని ఫౌండేషన్ రైతు పొదుపు సంఘాలపై సభ్యులు అవగాహన కలిగి ఉండాలని సీఎస్సార్ హెడ్ రాజేష్‌రంజన్ పేర్కొన్నారు. ఆదాని కృష్ణపోర్టులోని ఫౌండేషన్ కార్యాలయంలో బుధవారం జరిగిన రైతు పొదుపు సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు వ్యవసాయం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలను తెలుసుకోవాలన్నారు. పండ్ల తోటల పెంపకం ద్వారా జీవనోపాధి పొందాలన్నారు. ఏఓ జోత్స్నారాణి, ఉద్యాన శాఖ అధికారి ప్రేమలత, తదితరులు రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్‌బాబు, టీ రవీంద్ర, అరుణ్ పాల్గొన్నారు.

చుక్కల చిక్కులకు శాశ్వత పరిష్కారం

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



రైతులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: ఎన్నో ఏళ్లుగా చుక్కల భూముల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాశ్వత పరిష్కారం చూపి విముక్తి కల్పించారని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో చుక్కల భూముల నుంచి విముక్తి పొందిన 25 మంది రైతులకు బుధవారం ఆయన పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నాటి నుంచి రెవెన్యూ రికార్డుల్లో భూములను చుక్కలుగా చూపడంతో వాటిని సాగుచేసుకుంటున్న రైతులు అమ్ముకోలేక, బ్యాంకుల్లో రుణాలు పొందలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్య పరిష్కారానికి గతంలో ఏ ముఖ్యమంత్రి చొరవచూపలేదన్నారు. ఈ సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా చుక్కల భూములకు విముక్తి కల్పించేందుకు చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. కోవూరు మండలంలోని 25 సర్వే నంబర్లలోని 25 మంది రైతులకు చెందిన 50 ఎకరాల చుక్కల భూములకు విముక్తి కల్పించినట్లు తెలిపారు.

ఎన్‌పీఎస్సార్ ట్రస్టు ద్వారా రూ.2.40 లక్షల ఆర్థిక సాయం

తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు, అనారోగ్యంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పలువురికి ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేయూతనందించారు. తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.2.40లక్షల ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. కోవూరుకు చెందిన నెల్లూరు మోక్షిత, నెల్లూరు సుప్రజ తల్లిదండ్రుల ఆదరణ కోల్పోవడంతో రూ.20వేలు చొప్పున సాయం అందజేశారు. బీటెక్ విద్యార్థిని వీ కరుణాశ్రీకి రూ.30వేలు అందజేశారు. కొత్తూరు దళితవాడకు చెందిన పెరాలసిస్ బాధితుడు వినయ్‌కుమార్‌కు రూ.10వేలు, బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్న వలంటీర్ సుభాషిణికి రూ.20వేలు సాయం చేశారు. పడుగుపాడుకు చెందిన అనారోగ్య బాధితులు నూనె ప్రవల్లిక, నూనె భార్గవ్, అమ్రిన్, అహ్మద్, బిత్ర తులసి , బిత్ర శివ ప్రియకు రూ.20వేలు చొప్పున అందజేశారు. డీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, ఎంఏఏబీ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, పుచ్చలపల్లి వెంకటరమణారెడ్డి, అనూప్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీహరి, వైస్‌ఎంపీపీ నరసింహులురెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ ప్రసాద్, కోవూరు, గంగవరం సర్పంచ్‌లు విజయ, లక్ష్మీకుమారి, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు బాండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

ఖాతాదారులకు మెరుగైన సేవలు



మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ నిరూపమదేవి

పొదలకూరు : పట్టణంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో ఖాతాదారుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ సీహెచ్ నిరూపమదేవి మాట్లాడుతూ తమ బ్యాంకు ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. జేఎల్‌జీ, ఎస్‌ఎంఈ, హౌస్, గోల్డ్, ఎడ్యుకేషన్ రుణాలను తక్కువ వడ్డీకే అందజేస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

వేరుశనగ సాగులో మెలకువలు పాటించాలి



విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ఏడీ సుజాత

కోవూరు(విడవలూరు): వేరుశనగ సాగులో రైతులు మెలకువలు పాటించాలని ఏడీఏ సుజాత అన్నారు. విడవలూరు మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో వేరుశనగ సాగుకు సిద్ధమవుతున్న రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో కదిరి లేపాక్షి రకం ఎక్కువగా సాగు చేస్తున్నారన్నారు. పంట కాలం 105 నుంచి 115 రోజులు ఉంటుందన్నారు. ఎకరాకు 30 నుంచి 35 కిలోలు గింజలు సరిపోతాయని చెప్పారు. గింజలు విత్తే సమయంలో వరుసల మధ్యన 30 సెం.మీ దూరం ఉండేలా చూసుకోవాన్నారు. ఈ రకం ఆకుమచ్చ వైరస్ తెగుళ్ల, రసం పీల్చే తామర పురుగులను తట్టుకుంటుందన్నారు. 70 శాతం గింజతో 51 శాతం నూనెతో ఎకరాకు 14 క్వింటాళ్ల వరకు అధిక దిగుబడి వస్తుందన్నారు. అనంతరం విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు .ఆమె వెంట ఏఓ శ్రీనివాసులు, వీఏఏలు, తదితరులు ఉన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



జూనియర్ కళాశాలను ప్రారంభిస్తున్న పీఆర్వో వేణుగోపాల్

ముత్తుకూరు: విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆదాని కృష్ణపట్నం పోర్టు పీఆర్వో జీ వేణుగోపాల్ పేర్కొన్నారు. ముత్తుకూరులోని పోర్టు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆదాని జూనియర్ కళాశాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు ఉన్నత పాఠశాలలను మాత్రమే నిర్వహించామని తెలిపారు. ప్రస్తుతం జూనియర్ కళాశాలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి



ఎస్‌ఐసీ సాఫ్ట్‌వేర్ పనితీరును పరిశీలిస్తున్న ట్రైయినీ కలెక్టర్ మహేష్, ఏపీడీ శ్రీహరి

పొదలకూరు : ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను పెంచాలని, లేకుంటే చర్యలు తప్పవని డ్వామా ఏడీపీ శ్రీహరిరెడ్డి ఉపాధి సిబ్బందిని హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ట్రెయినీ కలెక్టర్ మహేష్ అల్కతూర్‌తో కలిసి ఉపాధి సిబ్బందితో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ కూలీలకు పనులు కల్పించడంలో క్షేత్రసహాయకులు వెనుకబడ్డారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు అవగాహన కల్పించి ఉపాధి పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జూన్ నెలాఖరుకు నిత్యం మూడు వేల మంది కూలీలకు పనులు కల్పించాలని సూచించారు. మండలంలోని కూలీలకు కనీసవేతనం కల్పించడంలో క్షేత్రసహాయకులు వెనకబడ్డారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇతర మండలాల్లో కనీస వేతనం రూ.252 వరకు అందుతుండగా, పొదలకూరు మండలంలో రూ.220 మాత్రమే అందిస్తున్నారని చెప్పారు. కూలీలకు కనీసవేతనం పెరగకుంటే లేబర్ కాంపొనెంట్ తగ్గుతుందన్నారు. దీనివల్ల తీవ్రపరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. మండలంలో మెటీరియల్ కాంపొనెంట్ బాగా ఉన్నందున, అందుకు తగిన విధంగా కూలీల హాజరును పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మూడేళ్లుగా ఉపాధి పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న నిధులు సుమారు రూ.14 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. అనంతరం ట్రెయినీ కలెక్టర్ మహేష్, ఏపీడీ శ్రీహరిరెడ్డి బిరదవోలు, మొగళ్లూరు గ్రామాల్లో ఉపాధి పనులు, అవెన్యూ ప్లాంటేషన్, హార్టికల్చర్, వైఎస్సార్ జలకళ, ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ భవనాలను పరిశీలించారు. ఏపీఓ మధుసూదన్, ఈసీ సుధాకర్, టీఏలు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు



క్షతగాత్రుడ్ని ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం: మామిడి పండ్ల లోడుతో నెల్లూరు నుంచి బుచ్చిరెడ్డిపాళెం వైపు వెళ్తున్న ఆటోను వెనుకగా కారు ఢీకొనడంతో ఆటో డ్రైవర్ గాయపడ్డాడు. ఈ ఘటన దామరమడుగు వద్ద ముంబయి జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన సీహెచ్ వెంకటరమణయ్య వ్యాపారం నిమిత్తం ఆటోలో నెల్లూరు నుంచి మామిడి పండ్లు తీసుకుని బుచ్చిరెడ్డిపాళెం వస్తున్నాడు. ఈ క్రమంలో దామరమడుగు వద్ద నెల్లూరు నుంచి అతివేగంగా వస్తున్న కారు ముందు వెళుతున్న ఆటోను ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్ వెంకరమణయ్య గాయపడగా 108 వాహన సిబ్బంది నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై పోలీస్‌లకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

నేడు మంత్రి కాకాణి పర్యటన

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం పొదలకూరులో పర్యటించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ నరసింహారెడ్డి బుధవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు డీఎన్నార్ బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పురస్కారాలతో పాటు ప్రోత్సాహక నగదు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. అనంతరం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండలాధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

ఆర్‌ఐ బాధ్యతల స్వీకరణ

పొదలకూరు : మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా రవికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కొండాపురంలో పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. మండల ఆర్‌ఐగా విధులు నిర్వహిస్తున్న నవీన్‌ను గతంలో కలువాయిలో జరిగిన భూ సేకరణలో అవకతవకలకు పాల్పడడంపై కలెక్టర్ సస్పెండ్ చేశారు.

పశుసంవర్ధక శాఖ ఏడీ బాధ్యతల స్వీకరణ

పొదలకూరు : పశుసంవర్ధక శాఖ పొదలకూరు అసిస్టెంట్ డైరెక్టర్‌గా అరుణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏడీగా విధులు నిర్వహిస్తున్న కృష్ణమూర్తి నెల్లూరు వీటీసీకి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో నెల్లూరు బీటీసీలో విధులు నిర్వహిస్తున్న అరుణ బదిలీపై వచ్చారు.

వివాహిత మృతిపై కేసు నమోదు

పొదలకూరు : మండలంలోని ఊసపల్లికి చెందిన వివాహిత మృతిపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు కండలేరు డ్యామ్ ఎస్సై అనూష తెలిపారు. వివరాలు..ఊసపల్లికి చెందిన బొమ్మిశెట్టి బాబూరావుకు నెల్లూరు రూరల్ ప్రాంతానికి చెందిన లక్ష్మీనవీన(20)కు రెండేళ్ల క్రితం వివాహమైంది. మంగళవారం లక్ష్మీనవీనకు ఏమైందో ఏమో ఒక్కసారిగా అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందింది. ఆమె మృతిపై అనుమానంతో పుట్టింటి వారు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో లక్ష్మీనవీన మృతదేహాన్ని రాపూరు సీఐ కోటేశ్వరరావు, ఎస్సై అనూష, పొదలకూరు డిప్యూటీ తహసీల్దార్ గణేష్‌సాయి, వీఆర్వో మాలకొండయ్య పరిశీలించారు. మృతదేహాన్ని నెల్లూరు జీజీహెచ్‌కు తరలించి పోస్టుమార్టమ్ నిర్వహించారు. వివాహిత మరణానికి కారణం తెలియకపోవడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నోట్ పుస్తకాల పంపిణీ



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని పోలినాయుడుచెరువు ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు సాప్ ఆధ్వర్యంలో బుధవారం నోట్ పుస్తకాలు, విద్యా ఉపకరణాలను పంపిణీ చేశారు. జీవీపీ బ్రెయిన్ సెంటర్ అధినేత డాక్టర్ జీ వెంకటేశ్వరప్రసన్న ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పేద పిల్లల విద్యాభివృద్ధికి తోడ్పడాలనే ఆలోచనతో దాదాపు 100 మందికి నోట్ పుస్తకాలు, విద్యా ఉపకరణాలను అందజేసినట్లు తెలిపారు. అనంతరం వెంకటేశ్వరప్రసన్నను సన్మానించారు. సాప్ అధ్యక్షుడు శ్రీలక్ష్మణ శ్రీకర్, సురేంద్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్యభారతం సాకారం కావాలి

- మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు

వెంకటాచలం: పేదరికం, వివక్షకు తావులేని ఆరోగ్య భారతం సాకారం కావాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో కిమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ నిపుణులైన వైద్యుల సేవలను పేదలు వినియోగించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఇటీవల ప్రపంచ జనాభాలో దేశం మొదటి స్థానానికి చేరడం ఆందోళనాకరమన్నారు. ఇలాంటి విషయాల్లో ప్రజల్లో అవగాహన, స్వీయ నియంత్రణ అవసరమన్నారు. జనాభా పెరుగుదల నేపథ్యంలో సుఖంగా, ఆరోగ్యకరంగా, సంతోకరంగా ప్రజలు జీవించే విధంగా దేశంలో సౌకర్యాల కల్పన అత్యంత అవశ్యకమన్నారు. ఈ విషయంలో ప్రభుత్వాలతో పాటుగా వివిధ రంగాలకు చెందిన నిపుణులు దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వైద్య సౌకర్యాల కల్పన సవాలుతో కూడుకున్నదని, తక్కువ ధరకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వాలతో పాటు ప్రైవేట్ వైద్య సంస్థలు, సేవా సంస్థలు తమవంతు పాత్ర పోషించాలన్నారు. ప్రపంచ వ్యాపంగా మారుతున్న జీవనశైలితో వ్యాధులు పెరుగుతున్నాయని, ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. నిత్యం వ్యాయామం, యోగా వంటి వాటికి సమయం కేటాయించడం, సంప్రదాయ ఆహారాన్ని తీసుకోవడం వంటి జాగ్రత్తలు అవసరమని సూచించారు. స్వర్ణభారత్ ట్రస్ట్ ఏర్పాటు చేసినప్పటి నుంచి గ్రామీణ ప్రాంత ప్రజల కోసం ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వైద్య ప్రముఖులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్వర్ణభారత్ ట్రస్ట్ చైర్మన్ కామినేని శ్రీనివాస్, ట్రస్టీ దీపావెంకట్, పలువురు వైద్య ప్రముఖులు పాల్గొన్నారు.

విద్యకు ప్రభుత్వం పెద్దపీట



వెంకటాచలంలో జగనన్న విద్యాకానుకల పంపిణీ



బుచ్చిరెడ్డిపాళెం: వవ్వేరులో..



కోవూరులో..

వెంకటాచలం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యకు పెద్దపీట వేస్తూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారప్రతినిధి మందల వెంకటశేషయ్య పేర్కొన్నారు. వెంకటాచలం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేయడంతో విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్ల బాట పట్టారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు క్రింద ప్రభుత్వ పాఠశాలల రూపరేఖలు మార్చడంతో విద్యార్థులు మళ్లీ ప్రభుత్వ పాఠశాలల బాట పడుతున్నారన్నారు. పేద విద్యార్థుల కోసం జగనన్న విద్యాకానుక కింద రూ.2వేల విలువైన కిట్లను అందజేస్తున్నారని తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని 26,500 మంది విద్యార్థులకు రూ.5.30కోట్ల విలువ చేసే కిట్లను అందజేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని లత, విద్యాకమిటీ చైర్మన్ ముత్తార్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని వవ్వేరు ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను బుధవారం పంపిణీ చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు కోటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి,సచివాలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

- రేబాల పంచాయతీ నెహ్రూనగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను బుధవారం పంపిణీ చేశారు. సర్పంచ్ భాగ్యలక్ష్మి, నాయకులు నాగసుబ్బారెడ్డి, మస్తానయ్య, హరిప్రసాద్‌రెడ్డి, సుధాకర్, హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కోవూరు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలని డీఎల్‌డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. పడుగుపాడు పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు. వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నల్లపరెడ్డి రాహెన్‌రెడ్డి, హెచ్‌ఎం మోహన్‌రావు, ఉపాధ్యాయులు సుధాకర్, వెల్ఫేర్ అసిస్టెంట్ భాను, వలంటీర్ సురేఖ, తదితరులు పాల్గొన్నారు.

కోవూరు(కొడవలూరు) : కొడవలూరు మండలం పెయ్యలపాళెంలో ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను బుధవారం పంపిణీ చేశారు. పెయ్యలపాళెం సొసైటీ చైర్మన్ పీ శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ అనూష, విద్యా కమిటీ సభ్యులు విజయ్‌కుమార్, కిరణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధన



తల్లులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

మనుబోలు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన చేస్తున్నామని బద్దెవోలు ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం తులసి తెలిపారు. బుధవారం ఆమె గ్రామంలోని ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రచారం నిర్వహించారు. ఆమె వెంట ఉపాధ్యాయిని శైలజ, అంగన్‌వాడీ కార్యకర్తలు దొరసానమ్మ, రాధ, సంపూర్ణమ్మ, తదితరులు ఉన్నారు.

ముత్తుకూరు: సుబ్బారెడ్డిపాళెం యూపీ స్కూల్ ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పించారు. 1వ తరగతిలో ఏడుగురు, ఆరో తరగతిలో ఏడుగురు విద్యార్థులను చేర్పించుకుని ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోమాపద్మారత్నం, జే జనార్దన్, ఎన్ సుబ్బరత్నమ్మ, ఏ రమ, కే సాయికుమార్ పాల్గొన్నారు.

పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పొదలకూరు : వైఎస్సార్ పశుబీమా పథకాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ పొదలకూరు ఏడీఏ అరుణ కోరారు. మండలంలోని నేదురుమల్లి, బత్తులపల్లి ఆర్‌బీకేల పరిధిలో బుధవారం పశువిజ్ఞాన బడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ పశుబీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. అధిక పాలదిగుబడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. తాటిపర్తి డాక్టర్ సీ మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ గతంలో మృతి చెందిన పశువులకు వైఎస్సార్ పశునష్ట పరిహారం కింద రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్లు తెలిపారు. అల్లూర్తి డాక్టర్ రాధిక, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రావణసేవ

కోవూరు(విడవలూరు): విడవలూరు మండలం రామతీర్థంలో కొలువైన కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి రావణసేవను వైభవంగా నిర్వహించారు. రామలింగేశ్వరుడ్ని విశేషంగా అలంకరించి రావణ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. రామతీర్థం గౌడ సంఘం వారు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ చైర్మన్ నాటారు చంద్రయ్య , పాలకవర్గ సభ్యులు, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

ఇందుకూరుపేట: మేనాటిపాళేనికి చెందిన తమ్మిరెడ్డి ఆదెమ్మ(71) పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల కథనం మేరకు...గత కొద్దిరోజులుగా ఆదెమ్మ అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో కుటుంబంలో నెలకొన్న చిన్నవివాదంతో మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బుధవారం ఆదెమ్మ మృతి చెందింది. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట రాజేష్ తెలిపారు.

నరుకూరులో రెవెన్యూ సదస్సు



తోటపల్లిగూడూరు: మండలంలోని నరుకూరు సచివాలయంలో తహసీల్దార్ హమీద్ ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రెవెన్యూ సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సునీల్, వీఆర్వో కార్తీక్ , సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.